సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



ప్రైవేట్ స్కూల్‌లో కరోనా

గార్లలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 18 మంది విద్యార్థులకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. - 8లో



వినతులు పరిష్కరించాలి

వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టరేట్లలో, బల్దియాలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అధికారులు వినతులు స్వీకరించారు. 8లో

గరిష్టం/కనిష్టం

42^{0} /25^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి వాతావరణం వేడిగా ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది. రాత్రిళ్లు ఉక్కపోత ఉండనుంది.



న్యూస్‌రీల్

నేడు రామప్పకు ప్రత్యేక బస్సులు



హన్మకొండ: ప్రపంచ వారసత్వ వేడుకలు నిర్వహిస్తున్న రామప్ప ఆలయం వద్దకు మంగళవారం టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ జె.శ్రీదేవి తెలిపారు. హనుమకొండ, ములుగు నుంచి రామప్పకు ఈ ప్రత్యేక బస్సులు నడుస్తాయని పేర్కొన్నారు. చార్జీలు హనుమకొండ నుంచి రామప్పకు పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.60, ములుగు నుంచి పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.30గా నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులు, సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించాలనుకుంటున్న ఆసక్తిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు టీజీఓ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

హన్మకొండ: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీఓ) అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల ఉమ్మడి సర్వసభ్య సమావేశాన్ని ఈనెల మంగళవారం నిర్వహించనున్నారు. హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు అసోషియేషన్ ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి టీజీఓ అసోషియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, టీజీఓ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పాల్గొననున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ పథకాల అమలు, అధికారుల పాత్ర, గెజిటెడ్ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల గెజిటెడ్ అధికారులంతా పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆరుగురు డీబార్

కేయూ క్యాంపస్: కేయూపరిధిలో సోమవారం నిర్వహించిన దూరవిద్య పీజీ సెకండియర్ పరీక్షల్లో వివిధ కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ ఆరుగురు విద్యార్థులు స్క్వాడ్లకు పట్టుబడి డీబార్ అయ్యారని పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు.

కేయూ ఐదేళ్ల లా కోర్సు సెమిస్టర్ల పరీక్షల షెడ్యూల్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఐదేళ్ల లా కోర్సు మొదటి, మూడవ, ఐదవ, ఏడవ, తొమ్మిదవ సెమిస్టర్ల పరీక్షల షెడ్యూల్‌ను పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల లాకోర్సు తొమ్మిదవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 24, 27, మే 1, 4, 8వ తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. మూడవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 25, 27, 29, మే 2వ తేదీల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతాయి. మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 26, 28, మే 1, 3వ తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ఐదవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 26, 29, మే 3, 6, 10వ తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. ఏడవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 25, 28, మే 2, 5, 9వ తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయి.

'మిషన్ వాత్సల్య'పై నేడు అవగాహన సదస్సు

వరంగల్: మిషన్ వాత్సల్య పథకం- బాలల హక్కుల పరిరక్షణకు క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించేందుకు మంగళవారం హనుమకొండ వడ్డేపల్లిలోని ఎస్‌వీ ఫంక్షన్‌హాల్‌లో సదస్సు ఏర్పాటు చేసినట్లు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని సర్పంచ్‌లు, ఎంపీపీ అధ్యక్షులు, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, జిల్లా బాలల పరిరక్షణ విభాగాలు, గ్రామ బాలల పరిరక్షణ కమిటీలకు బాలల హక్కులపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

తొలి వేడుకకు వేళాయె..

నేడు రామప్పలో ప్రపంచ వారసత్వ ఉత్సవాలు

- నరస్సు కట్టపై ఫుడ్ ఫెస్టివల్
- సాయంత్రం 5గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు
- హాజరుకానున్న మంత్రులు శ్రీనివాస్ గౌడ్, దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ప్రజాప్రతినిధులు
- భారీ ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం



వెంకటాపురం(ఎం): యునెస్కో గుర్తింపు పొందిన ములుగు జిల్లా వెంకటాపురం (ఎం) మండలం పాలంపేటలోని రామప్ప ఆలయంలో తొలిసారిగా మంగళవారం 'శిల్పం వర్ణం కృష్ణం' పేరుతో ప్రపంచ వారసత్వ ఉత్సవాలు జరగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఉత్సవాలకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు 20వేల మంది ఉత్సవాలను వీక్షించే విధంగా స్టేజీ నిర్మాణం, గార్డెన్‌లో పలు చోట్ల ఆరు ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. వీఐపీలు, అధికారులు, ప్రజాప్రతినిధులకు వేర్వేరుగా గ్యాలరీలు ఏర్పాటు చేశారు. వారసత్వ ఉత్సవాల్లో ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్, ప్రముఖ డ్రమ్స్ వాయిద్య కళాకారుడు శివమణి, సింగర్ కార్తీక్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. సుమారు 300మందికి పైగా కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని అలరించనున్నారు. వారసత్వ వేడుకలకు మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, కలెక్టర్ కృష్ణ ఆదిత్య, జెడ్పీ చైర్మన్ జగదీశ్, ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే సీతక్క హాజరుకానున్నారు.

సరస్సు కట్టపై ఫుడ్ ఫెస్టివల్

రామప్ప సరస్సు కట్టపై ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రాంతంలోని వివిధ వంటకాలు, రుచులతోపాటు చేనేత ఉత్పత్తులు, చేతివృత్తుల వారు తయారు చేసిన వస్తువులను సైతం ప్రదర్శించనున్నారు.

ప్రతిఏటా ఉత్సవాలు

1213లో కాకతీయులు నిర్మించిన రామప్ప ఆలయానికి 2021 జూలై 25న యునెస్కో గుర్తింపు లభించింది. ఇసుకపై ఆలయాన్ని నిర్మించడం, ఆలయానికి ఉపయోగించిన రాయిలో రెండు రంగులు ఉండడం, నీటిలో తేలాడే ఇటుకలతో గోపురాన్ని నిర్మించడం లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రపంచ వారసత్వ హోదాను కల్పించారు. యునెస్కో గుర్తింపు పొందిన తర్వాత రామప్ప ఆలయంలో తొలిసారిగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇకనుంచి ప్రతి ఏటా ఈ ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది.



గార్డెన్‌లో ఏర్పాటుచేసిన కుర్చీలు, ఎల్ఈడీ స్క్రీన్లు



ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గణేష్, అధికారులు

వారసత్వ ఉత్సవాలకు సిద్ధం

ములుగు అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్

ప్రపంచ వారసత్వ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు ములుగు అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్ తెలిపారు. రామప్పలో వారసత్వ ఉత్సవాల ఏర్పాట్లను డీఆర్‌ఓ రమాదేవితో కలిసి సోమవారం పరిశీలించి మాట్లాడారు. ఉత్సవాలను ప్రజలు వీక్షించేందుకు మంగళవారం ఉదయం నుంచి హనుమకొండ, ములుగు ప్రాంతాల నుంచి రామప్పకు ప్రత్యేక ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ విజయభాస్కర్, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేష్, డీసీఓ సర్దార్‌సింగ్, డీడబ్ల్యూఓ ప్రేమలత, మండల స్పెషల్ ఆఫీసర్ పిల్లి శ్రీపతి, తహసీల్దార్ పంతకంటి మంజుల తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా రామప్పను ఓఎస్‌డీ అశోక్ కుమార్, సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై తాజుద్దీన్‌లు సందర్శించి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు.

నేటిసాయంత్రం 5గంటల నుంచి కార్యక్రమాలు ఇలా ..

- సాయంత్రం 5 గంటల నుంచి 5:15 వరకు రామప్ప టూరిజం వీడియోస్, సెలబ్రిటీ, స్పాన్సర్ల వీడియోల ప్రదర్శన
- 5:15 నుంచి 5:30 వరకు అనిశ్రితరెడ్డి వెల్కమ్ డాన్స్, ములుగు జిల్లా కళాకారుల ప్రదర్శన, సుధీర్‌రావు బృందంతో కూచిపూడి నృత్యం
- 5:30 నుంచి 6గంటల వరకు 70 మంది వయోలిన్ కళాకారులతో అరబీ వయోలిన్ వాయిద్య కళాకారుడు గురూజీ అశోక్ గుజ్జల్ ప్రదర్శన
- 6గంటల నుంచి 6:15 వరకు యాంకర్ ద్వారా అతిథులను స్టేజీపైకి ఆహ్వానించడం, జ్యోతి ప్రజ్వలన
- 6:15 నుంచి 6:25 వరకు పేరిణి రాజ్‌కుమార్ బృందంతో నృత్య ప్రదర్శన
- 6:25 నుంచి 6:35 వరకు రామప్ప డాక్యుమెంటరీ వీడియో ప్రదర్శన
- 6:35 నుంచి 6:50 వరకు బెంగళూరుకు చెందిన సూర్య ఎస్ రావు బృందంతో 'రావణ' నాటక ప్రదర్శన
- 6:50 నుంచి 6:55 వరకు ప్రోగ్రాం స్పాన్సర్స్‌కు చెందిన వీడియోల ప్రదర్శన
- 6:55 నుంచి 7:20 వరకు హెరిటేజ్ ఇండియా ఆధ్వర్యంలో శ్రావ్యమానస డాన్స్ అకాడమీకి చెందిన 200 మంది కళాకారులతో క్లాసికల్, ఫోక్ నృత్య ప్రదర్శనలు
- 7:20 నుంచి 7:30 వరకు బలగం చిత్ర యూనిట్‌కు సన్మానం
- 7:30 నుంచి 7:45 వరకు డ్యాన్స్ డైరెక్టర్ విజయజ్యోతి రాసిన రామప్ప ఆలయ నాట్యశాస్త్ర పుస్తక ఆవిష్కరణ
- 7:45 నుంచి 7:55 వరకు రామప్ప ఆలయ విశిష్టతపై లేజర్ షో ప్రదర్శన
- 8గంటల నుంచి 8:20 వేదికపైకి మంత్రులను ఆహ్వానించడం, అతిథుల ప్రసంగం
- 8:20 నుంచి 9:40 వరకు ఎస్ఎస్ తమన్, శివమణి, కార్తీక్, ఫ్లూట్ నవీన్‌ల ప్రదర్శనలు
- 9:40 నుంచి 9:55 వరకు ముగింపు కార్యక్రమం

గ్రేటర్ వరంగల్ 'ప్లానింగ్'పై కొరడా

9మంది టీపీఎస్, టీపీబీఓలకు రూ.3వేల చొప్పున జరిమానా

వరంగల్ అర్బన్ : ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేస్తే గ్రేటర్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది సవాలక్ష అభ్యంతరాలు చెబుతారు. నిబంధనల పేరుతో హడావుడి చేస్తారు. అదిగో, ఇదిగో అంటూ అవినీతి, అలక్ష్యం, పర్యవేక్షణాలోపం ఇప్పుడు వారికి సమస్యలు తెచ్చిపెట్టింది. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణ దరఖాస్తుల పరిష్కారంలో విఫలమైన రాష్ట్ర వ్యాప్తంగా 90మందికి రూ.2.52 లక్షలు జరిమానా విధించగా, అందులో గ్రేటర్ వరంగల్‌కు చెందిన 9మంది టీపీఎస్ టీపీబీఓలు ఉన్నారు. ఈ సొమ్మును ఉద్యోగుల జీతభత్యాల నుంచి రికవరీ చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

సులభంగా అనుమతుల కోసం..

కొత్తగా ఇల్లు కట్టుకోవాలనుకునే వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం- 2019 టీఎస్-బీపాస్‌ను తీసుకొచ్చింది. ఇందులో దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లో అనుమతివ్వాలి. లేదా తిరస్కరించాలి. కానీ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కొందరు దరఖాస్తుదారులు నెలల తరబడి టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది చుట్టూ తిరుగుతున్నా అనుమతులు మంజూరు కావడం లేదు. డబ్బులు ముట్టజెప్పితే చకచకా ఫైళ్లు ముందుకు కదులుతున్నాయి. పెండింగ్ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర పురపాలక శాఖ ఉన్నతాధికారులు టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పనితీరుపై నిఘా పెట్టారు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి కాలంలో భవన నిర్మాణ దరఖాస్తులపై ఎప్పటికప్పుడు 'ఆన్‌లైన్'ను పర్యవేక్షించారు. చివరికి ఫైళ్ల పరిష్కారంలో జాప్యం చేసిన అధికారులు, సిబ్బందిపై చర్యలకు ఉపక్రమించారు.

ఉద్యోగుల్లో కలవరం

నిబంధనలకు ప్రకారం అనుమతుల జారీలో జాప్యం చేస్తున్న బల్దియాకు చెందిన 9మంది టీపీఎస్, టీపీబీఓ(అనిల్, ప్రణవ్, సంతోష్, సంధ్యారాణి, శ్రావణి, రోజారెడ్డి, కె.అనిల్ కుమార్, తేజస్విని, శ్రీనివాస్‌రెడ్డి)లకు జరిమానా విధించడంతో మిగతా ఉద్యోగుల్లో కలవరం మొదలైంది. అదేవిధంగా పన్నులు, ప్రజారోగ్యం, ఇంజినీరింగ్ విభాగాల్లో ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విభాగాలను కూడా ప్రక్షాళన చేస్తే అధికారులు, సిబ్బందిలో ఉన్న నిర్లక్ష్యం మరింత బహిర్గతమవుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

వరంగల్ అర్బన్: వరంగల్ నగరంలో అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఆ కాంట్రాక్టర్లను గుర్తించి నోటీసులు జారీ చేయాలని మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రావీణ్య ఆదేశించారు. నగరంలో పురోగతిలో ఉన్న పట్టణ ప్రగతి, జనరల్ ఫండ్, సీఎంఏ, 15 ఆర్థిక సంఘం, ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్‌తోపాటు తాగునీటి సరఫరాపై సోమవారం సమీక్షించి దిశానిర్దేశం చేశారు. టెండర్లు పూర్తయిన పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని సూచించారు. ప్రతిపాదిత పనులకు టెండర్లు నిర్వహించాలన్నారు. పనులను దగ్గర ఉండి పూర్తి చేయించాలన్నారు. నగరంలో మంచినీటి సరఫరా తీరును సమీక్షిస్తూ వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే లీకేజీలను ఎప్పటికప్పుడు అరికట్టడంతోపాటు అన్ని డివిజన్లో మంచినీటి సరఫరా సవ్యంగా సాగాలన్నారు. ఇంజనీర్లు ప్రతిరోజు ఉదయం క్షేత్రస్థాయిలో నీటిసరఫరా పరిశీలించాలని, ఏమైనా సమస్యలు తలెత్తితే అధిగమించాలన్నారు. పైపులైన్లు, పంపింగ్ సమస్యలు ఉన్న కాలనీలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరందించాలన్నారు. నీటి సరఫరా ఇబ్బందులు లేకుండా ఎండకాలం కోసం ప్రత్యేకంగా 2 నెలల పాటు దినసరి ప్రాతిపదికన కార్మికులను నియమించుకోవాలని ఆదేశించారు. నగరంలోని ప్రధాన నాలాల్లో పూడికతీత ప్రక్రియ టెండర్లు పూర్తయినందున వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. సమీక్షలో బల్దియా, పబ్లిక్ హెల్త్ ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, శ్రీనివాసరావు, ఈఈలు శ్రీనివాసరావు, రాజయ్య, రాజ్ కుమార్, డీఈలు రవి కుమార్, నరేందర్, సంతోష్ బాబు, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ సుధారాణి, కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రావీణ్య

పండుగలకు రాష్ట్రప్రభుత్వం పెద్దపీట



రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: అన్ని మతాల పండుగలను అధికారికంగా నిర్వహిస్తూ పెద్దపీట వేస్తున్న ఏకైక ప్రభుత్వం రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా హనుమకొండ సుబేదారిలోని రాయల్ గార్డెన్‌లో సోమవారం అధికారికంగా ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని పండుగలకు ప్రభుత్వం దుస్తులు అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజు యాదవ్, జిల్లా మైనారిటీ సంక్షేమశాఖాధికారి మేన శ్రీను, డీఆర్‌ఓ వాసుచంద్ర, కార్పొరేటర్ బోయినిపల్లి రంజిత్ రావు, టీఆర్ఎస్ నాయకులు సుహాస్, దర్శన్ సింగ్, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో వినయ్‌భాస్కర్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, కుడా చైర్మన్ తదితరులు

43డిగ్రీలకు ఉష్ణోగ్రతలు

- మరో నాలుగు రోజులు ఎండల తీవ్రత
- ఆరెంజ్ జోన్‌గా ప్రకటన..
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

నగరంపై నిప్పులు


సాక్షిప్రతినిధి, వరంగల్: గ్రేటర్ వరంగల్‌పై నిప్పుల వాన పడినట్లు ఎండలు మండిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఉదయంనుంచే తీవ్రతను పెంచుతున్న ఎండలు మధ్యాహ్నం అయ్యే వరకు తారస్థాయికి చేరుతున్నాయి. ఆదివారం నుంచి తీవ్రరూపం దాల్చిన ఎండలు సోమవారం నిప్పుల కుంపటిని తలపించాయి. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరో నాలుగు రోజులు కూడా ఎండలు మండిపోయే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయగా, వరంగల్, హనుమకొండ జిల్లాలు ఆరెంజ్‌జోన్‌లో ఉన్నట్లు పేర్కొంది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఎండల్లో తిరగవద్దని, వడదెబ్బ ప్రమాదం ఉన్నందున తగిన జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

బాబోయ్ ఇవేమి ఎండలు...

గ్రేటర్ వరంగల్‌తోపాటు వరంగల్, హనుమకొండ జిల్లాలో రెండు రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలకు మహిళలు, వృద్ధులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది లంచ్‌బాక్సులతో వస్తూ సాయంత్రమైతే తప్ప ఇళ్లకు వెళ్లడం లేదు. పల్లె జనాలు, నగరవాసులు ఉదయం 10 గంటల లోపే పనులు పూర్తి చేసుకుని ఇళ్లలోకి చేరుకుంటున్నారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. మరో రెండు రోజుల్లో 2 నుంచి 4 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు.

అధికారుల అలర్ట్.. ప్రకటన

నగరంలోని ఆటోనగర్, ఐడీపీ రాంపూర్, హంటర్ రోడ్, ఆరెపల్లి, హసన్‌పర్తి, మడికొండ ప్రాంతాలలో మధ్యాహ్నం వరకు 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నేడు, రేపు, ఎల్లుండి 41 డిగ్రీల నుంచి 44 డిగ్రీలకు చేరవచ్చన్న వాతావరణ శాఖ ప్రకటనతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న వరంగల్‌లోని బట్టల బజార్ పై ఓవర్ బ్రిడ్జి



నిర్మానుష్యంగా వరంగల్ - ఖమ్మం రోడ్డు

వరంగల్, హనుమకొండ జిల్లాల్లో నాలుగు రోజులుగా నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతలు (డిగ్రీలు సెల్సియస్‌లలో)

	14వ తేదీ	15వ తేదీ	16వ తేదీ	17వ తేదీ
హనుమకొండ	41.00	41.06	43.0	43.1
వరంగల్	41.05	41.08	42.7	42.0





మధ్యాహ్నం నిర్మానుష్యంగా హనుమకొండ అదాలత్ జంక్షన్

ఒక్కసారిగా ఎండలు పెరిగాయి



ఒక్కసారిగా ఎండలు పెరిగాయి. పది దాటిందంటే బయటకు వెళ్లే పరిస్థితి లేదు. నాకు డబ్ల్యూపీఎస్ కిటికీలు తయారు చేసే దుకాణం ఉంది. సమయంతో పని లేకుండా గిరాకీ వచ్చేది. ఎండల కారణంగా పనిచేసే వారికి, ఖరీదుకు వచ్చే వారికి ఇబ్బంది అయితంది.

- మహేష్, వ్యాపారి, వరంగల్

ఈ ఎండలు భరించలేకపోతున్నం



ఎండల తీవ్రతను భరించలేకపోతున్నాం. ఏప్రిల్ నెల ప్రారంభంలో ఎప్పుడూ ఈ స్థాయి ఎండలను చూడలేదు. రెండు రోజులుగా ఎండల తీవ్రత పెరిగింది. ఉదయం 11 గంటల వరకే బయటకు వెళ్తున్నాం.

- పేపర్ శ్రీను, స్థానికుడు, శివనగర్

జాగ్రత్తలు పాటించాలి



రెండు రోజులనుంచి ఎండ తీవ్రత పెరిగింది. మరో రెండు, మూడు రోజులతోపాటు సాధారణంగా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల వరకు చేరుకునే పరిస్థితులు ఉంటున్నాయి. బయటకు వెళ్లేవారు గొడుగు, టోపి,తెల్లని రుమాలు, తప్పక ధరించాలి. నీరు, ఇతర ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ప్రతి పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాం.

- డీఎంహెచ్ఓ సాంబశివరావు

వేతనాలు చెల్లించండి మహాప్రభో

- బల్దియా ఎదుట స్వచ్ఛ ఆటోడ్రైవర్ కమ్ ఓనర్ల ధర్నా



వరంగల్ అర్బన్: పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట స్వచ్ఛ ఆటోడ్రైవర్ కమ్ ఓనర్లు ధర్నా నిర్వహించారు. కరోనా కష్టా కాలంలో అనేక ఆర్థిక ఒడుదొడుకుల నడుమ ఇంటింటా చెత్త సేకరించామని తెలిపారు. నాలుగు నెలల కిందట ఒప్పందం గడువు తీరిందని, తమను బల్దియా అవుట్‌సోర్సింగ్ కార్మికులుగా పరిగణించాలని నినాదాలు చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. స్వచ్ఛ ఆటోలపై ఆధార పడి కుటుంబాలను పోషించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయక పోతే బల్దియా ఎదుట పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని, అందుకు అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో స్వచ్ఛఆటో డ్రైవర్ కమ్ ఓనర్ల సంఘం నాయకులు రవీందర్, సురేందర్, అరబ్, కిషోర్, ప్రవీణ్, సాంబరాజు, సదానందం, సాంబయ్య పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ 36వ డివిజన్ చింతల్‌కు చెందిన ఎండీ.ఖలీమ్ (43) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ ముస్కు శ్రీనివాస్ తెలిపారు. అతడి భార్య ఎండీ.సల్మా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వినతులు పరిష్కరించాలి

- హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్


ప్రజావాణిలో వినతి పత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ పి.ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు

హన్మకొండ: ప్రజావాణి వినతులను త్వరితగతిన పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్.. అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి వాసుచంద్ర, డీఆర్‌డీఓ శ్రీనివాస్ కుమార్‌లు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన వినతిపత్రాలకు ప్రాధాన్యత ఇచ్చి ఆలస్యం చేయకుండా వెనువెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 75 దరకాస్తులు వచ్చాయని తెలిపారు. రెండు పడకు గదుల దరఖాస్తులు –07, వరంగల్ మహానగర సంస్థ కమిషనర్‌కు 10తోపాటు మిగతా విభాగాలకు దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివ రావు, డీపీఓ జగదీశ్వర్, వివిధ విభాగాల జిల్లా అధికారులు మేన శ్రీను, మాధవి లత, సబిత, నిర్మల, వసంత లక్ష్మి, సురేఖ, డాక్టర్ శ్రీనివాస్, నర్సిరెడ్డి, కలెక్టరేట్ ఏఓ కిరణ్ ప్రకాష్ పాల్గొన్నారు.

పెండింగ్ అర్జీలను పరిష్కరించండి: ప్రావీణ్య

వరంగల్: ప్రజావాణిలో పెండింగ్ అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలని వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వివిధ సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆమె సంబంధిత అధికారులకు పంపించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని వాటిని పరిష్కరించే బాధ్యత ప్రతీ అధికారిపై ఉందన్నారు. వివిధ సమస్యలపై 67 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇందులో భూ సమస్యలపై 28, వరంగల్ ఆర్డీఓకు 8, 'కుడా'కు 1, డీఈఓకు 3, కలెక్టరేట్ సి సెక్షన్‌కు 3, డీఆర్డీఓకు 3తోపాటు మిగతా విభాగాలకు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీవత్స కోట, ఆర్డీఓ మహేందర్ జీ, డీఆర్డీఓ సంపత్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్‌లో 18 మందికి కరోనా

- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- పిల్లలను ఇళ్లకు పంపించిన పాఠశాల యాజమాన్యం


కరోనా పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

గార్ల: స్థానిక బీఎస్ఎస్ (ప్రైవేట్) పాఠశాలలో 18 మంది విద్యార్థులు, సిబ్బందికి కరోనా పాజిటివ్ రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వీరిలో 14 మంది విద్యార్థులు, నలుగురి సిబ్బందికి పాజిటివ్ వచ్చినట్లు ముల్కనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి అవినాష్ తెలిపారు. తొలుత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు జ్వరం, జలుబు తగ్గకపోగా, వాసన రాకపోవడంతో అనుమానం వచ్చిన పాఠశాల సిబ్బంది గార్ల సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. వైద్యాధికారి హనుమంతరావు కరోనా పరీక్షలు నిర్వహించారు. ముగ్గురికి పాజిటివ్ వచ్చిందని, పాఠశాలలోని విద్యార్థులందరికీ కరోనా పరీక్షలు నిర్వహించాలని వైద్యుడు అవినాష్‌కు ఆయన సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యుడు తన సిబ్బందితో పాఠశాలలోని 60 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో మొత్తం 18 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది. వెంటనే పాఠశాల యాజమాన్యం పాజిటివ్ వచ్చిన వాళ్లను పాఠశాల వసతిగృహంలోని ఐసోలేషన్ గదిలో ఉంచి, మిగతా విద్యార్థులను తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారి ఇళ్లకు పంపించారు. అప్రమత్తమైన తహసీల్దార్ రాము, సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, పంచాయతీ సిబ్బందిచే పాఠశాల ప్రాంగణంలో క్లోరినేషన్ చేయించారు. పట్టణంలో ఒకేసారి 18 మందికి కరోనా రావడంతో మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఇస్మాయిల్ బేగ్, పద్మ, పార్వతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

- గ్రేటర్ గ్రీవెన్స్ సెల్‌కు 68 ఫిర్యాదులు
- స్వీకరించిన వింగ్ అధికారులు

వరంగల్ అర్బన్: కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్ సెల్‌కు ఫిర్యాదులు అందాయి. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటుచేసిన గ్రీవెన్స్‌లో వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొని నగరవాసులనుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 68 ఫిర్యాదులు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగం 35 , పన్నుల విభాగం 12, ఇంజనీరింగ్ విభాగం 12 , పబ్లిక్ హెల్త్ –శానిటేషన్ 04, వాటర్ సప్లయ్ 05 చొప్పున అందాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రవీందర్ యాదవ్, డిప్యూటీ కమిషనర్లు అనిసుర్ రషీద్, జోనా, శ్రీనివాస్ రెడ్డి, డీఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీహెచ్‌ఓ శ్రీనివాస రావు, సెక్రటరీ విజయలక్ష్మి, బయాలజిస్ట్ మాధవ రెడ్డి, సీపీ వెంకన్న ఎంహెచ్‌ఓ డా.జ్ఞానేశ్వర్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- 61వ డివిజన్ వెంకటాద్రి నగర్ 1–1–1350 వద్ద డ్రెయినేజీ నిర్మించాలని, 43వ డివిజన్ సాయినగర్‌లో, కాజీపేట రహ్మత్ నగర్‌లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మించాలని ఆయా కాలనీలవాసులు వినతిపత్రాలు అందజేశారు.
- వరంగల్ 11–823 ఇంటికి, ఖిలా వరంగల్ 33–3–114/4 , మధ్యకోట 20–9–5, 56వ డివిజన్‌లో పలు ఇళ్లకు నల్లా కనెక్షన్లు లేకున్నా బిల్లులు వస్తున్నాయని, మినహాయించాలని జంపాల పవన్ కుమార్, ఈశ్వరమ్మ, మధులు వేర్వేరుగా దరఖాస్తులు అందజేశారు.
- హనుమకొండ 4వ డివిజన్ యాదవనగర్‌లో మూడు నెలలుగా నల్లాలకు నీళ్లు రావడం లేదని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.
- వరంగల్ రూద్రమాంబనగర్ 16–4–162/2 ఇంటికి ఒక నల్లాకు బదులుగా రెండు నల్లాల బిల్లు వస్తుందని మినహాయించాలని సుహాసిని విన్నవించారు.
- 16వ డివిజన్ మథర్ థెరిస్సా కాలనీలో సీసీ రోడ్డు అసంపూర్తిగా నిర్మించారని, పూర్తి చేఆయలని కాలనీవాసి ఎలేంద్ర ఫిర్యాదు చేశారు.
- వరంగల్ విశ్వకర్మ వీధిలో స్వీట్ల తయారీ షాపు నుంచి పొగతో అనారోగ్యాల పాలవుతున్నామని, చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు.
- హనుమకొండ ఫారెస్టు ఆఫీస్‌కు సమీపంలో 1–7–70నుంచి 72 వరకు డ్రెయినేజీ నిర్మించాలని కాలనీవాసులు రాజేశ్వరీ, జగదీశ్వర్,స్వామి చరణ్, ప్రశాంత్ విన్నవించారు.
- బల్దియా ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాన్ని ఒక్కొక్కరికి రూ.21వేల చొప్పున అమలు చేయాలని, పలు సమస్యలతో కూడిన వినతిత్రాన్ని సీఐటీయూ నాయకులు వినతిపత్రం సమర్పించారు.


గ్రీవెన్ సెల్‌లో వినతి పత్రాలను ప్రజల నుంచి స్వీకరిస్తున్న అధికారులు

కారుణ్య నియామక ఉత్తర్వుల అందజేత

వరంగల్: వరంగల్ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నలుగురికి కారుణ్య నియామక ఉత్తర్వులను వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అందజేశారు. ఆఫీస్ సబార్డినేట్లుగా నియామక ఉత్తర్వులు పొందిన వారిలో పోలాల గణేశ్(మచ్చాపూర్), భూక్య క్రాంతికుమార్ (చెన్నారావుపేట), మహ్మద్ రహీల్ (వర్ధన్నపేట), బండారి గంగాదేవి(పోనకల్) ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ సంపత్‌రావు, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఉత్తర్వులు అందుకున్న వారితో జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, సీఈఓ సంపత్‌రావు

దినసరి కూలీగా సర్పంచ్

- అటు సర్పంచ్‌గా విధులు, ఇటు కుటుంబ పోషణకు పనులు
- కష్టాల కడలిలో ప్రథమ పౌరురాలు ఉప్పమ్మ


ఎండలో మిర్చి ఏరుతున్న సర్పంచ్ ఉప్పమ్మ


సర్పంచ్ ఉంటున్న రేకుల ఇల్లు

మరిపెడ రూరల్: ఆ గ్రామానికి ఆమె ప్రథమ పౌరురాలు. ఇల్లు గడవక తోటి కూలీలతో కూలీ పనులకు వెళ్తోంది. ఓ పక్క గ్రామసర్పంచ్‌గా విధులు నిర్వహిస్తూనే, మరో పక్క కుటుంబ పోషణ కోసం దినసరి కూలీగా పనులకు వెళ్తుంది. మండలంలోని వెంకంపాడు గ్రామం ప్రత్యేక తెలంగాణ తర్వాత కొత్త జీపీగా ఏర్పాటైంది. రిజర్వేషన్ కారణంగా 2019 జనవరి 25న సర్పంచ్‌గా తప్పెట్ల ఉప్పమ్మ ఎన్నికైంది. పంచాయతీకి మొదటి సర్పంచ్‌గా ఎన్నిక కావడంపై ఆనాడు ఆమె ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేసింది. కానీ ఆనందం ఎన్నో రోజులు నిలవలేదు. సర్పంచ్ ఎన్నికల్లో లక్షల్లో చేసిన అప్పులు తీర్చలేక, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా భారమై కుటుంబం దీనస్థితిలోకి వెళ్లింది. గతంలో హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్ ఏరియాలో వైజాగ్ మాజీ ఎమ్మెల్యే మల్ల విజయ్‌ప్రసాద్ వద్ద సర్పంచ్ భర్త వెంకన్న వాచ్‌మెన్‌గా పనిచేస్తూ పిల్లలను చదివించుకుంటున్నాడు. ఈ క్రమంలో వెంకంపాడు కొత్తగా జీపీగా ఏర్పాటైందని, గ్రామంలో సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం మీకే ఉందని కొందరు గ్రామపెద్దలు ఆశ చూపించారు. వారు చెప్పిన మాటలు విని ప్రజలకు సేవ చేసే భాగ్యం కలుగుతుందని పట్టణం నుంచి మూట ముల్లె సదురుకొని పల్లెకు బాట చేరుకున్నారు. కూతురు పెళ్లి కోసం దాచిన డబ్బులతో పాటు మరికొన్ని అప్పులు తెచ్చి ఎన్నికల్లో ఖర్చు చేశారు. గత మూడేళ్లుగా అరకొర వచ్చిన నిధులతో గ్రామాభివృద్ధికి సరిపోక మరికొన్ని అప్పులు చేయాల్సి వచ్చింది. ఇప్పుడు ఏడాదిగా చేసిన పనులకు బిల్లులు రాక ఆర్థికంగా చితికిపోయామని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేసింది. సర్పంచ్‌గా గౌరవ వేతనం అందడం లేదు. పెళ్లీడు కొచ్చిన కూతురుకు పెళ్లి చేద్దామన్న చేతిలో చిల్లి గవ్వ లేదు. గ్రామంలో సెంట్ భూమి లేదు. డబుల్ ఇంటిని ఇస్తారన్న ఆశతో ఉన్న ఇంటిని నేలమట్టం చేసి రేకుల షెడ్డు వేసుకున్నామని ఆవేదన చెందింది. ఇదే క్రమంలో అప్పులోల్లు ఇంటి చుట్టు తిరుగుతుంటే పరువు పోతుందని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. చేసేది ఏమిలేక దినసరి కూలీగా మిర్చి వేరడానికి ఎర్రటి ఎండలో రూ.200 కూలీకి వెళ్తున్నట్లు బోరున విలపించింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు ఉన్నప్పుడు మాత్రమే పాల్గొని, మిగిలిన సమయంలో దినసరి కూలీ పనులకు వెళ్తుంది. నాలాంటి కష్టాలు ఏ ప్రజాప్రతినిధికి కూడా రాకూడదని, ఇప్పటికైనా సీఎం కేసీఆర్ స్పందించి పెండింగ్‌లో పంచాయతీ అభివృద్ధి పనుల బిల్లులు వెంటనే విడుదల చేయించి తమను కష్టాల ఊబిలోనుంచి గట్టెక్కించాలని సర్పంచ్ ఉప్పమ్మ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

తల్లీ, ఇద్దరు కుమార్తెల అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌కు చెందిన తన చిన్నాన్న ఇంటిలో తలదాచుకుంటున్న తల్లితో పాటు ఇద్దరు కుమార్తెలు ఈనెల 10న అదృశ్యమైనట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్కు శ్రీనివాస్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. భార్యాభర్తల మధ్య గొడవలలు జరుగుతుండగా పరకాల పోలీస్ స్టేషన్, సుబేదారి మహిళా పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. దాంతో జిక్కమల్ల పార్వతి.. తన ఇద్దరు కుమార్తెలు సర్వశ్రీ, అక్షయను వెంట తీసుకుని శివగర్‌లోని ఆమె చిన్నాన్న కొక్కుల కుమార్ ఇంటికి వచ్చింది. ఈనెల 10న సాయంత్రం నుంచి పార్వతి, ఆమె ఇద్దరు కుమార్తెలు కనిపించడం లేదు. పరకాల మండలం మల్లారెడ్డి గ్రామానికి చెందిన పార్వతి భర్త జిక్కమల్ల రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సోమవారం ఇన్‌స్పెక్టర్ ముస్కు శ్రీనివాస్ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: రోడ్డుపై వెళ్తున్న ఓ వ్యక్తిని దుర్భాషలాడి బెదిరింపులకు పాల్పడిన చరణ్, రాజ్‌కుమార్, హుస్సేన్‌లపై కేసు నమోదు చేసి చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ముస్కు శ్రీనివాస్ తెలిపారు. ఉర్సు కరీమాబాద్ కుమ్మరివాడకు చెందిన ఆవునూరి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వేర్వేరు చోట్ల రెండు మృతదేహాలు లభ్యం

మడికొండ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో కాజీపేట మండలం అమ్మవారిపేటలో సోమవారం స్థానికులు అందించిన సమచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా సుమారు (65)ఏళ్ల వయస్సు కలిగిన పురుషుడి మృతదేహం లభించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే టేకులగూడెంలో సుమారు (60) ఏళ్ల గుర్తుతెలియని మృతదేహం లభించినట్లు ఎస్సై దివ్య తెలిపారు. మృతదేహాలను పరిశీలిస్తే యాచకులుగా ఉన్నారని, సరైన ఆహారం లభించక, ఎండ తీవ్రత భరించలేక మృతి చెందినట్లు భావిస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఎవరైనా కనపడకుండా పోయిన వ్యక్తులను గుర్తిస్తే మడికొండ పోలీసులను సంప్రదించాలని సుచించారు.

వివాహిత మృతి

మంగపేట: మండలంలోని కోమటిపల్లిలో కదారి జాన్సీ(20) వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. సంఘటనా స్థలాన్ని ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, సీఐ రాజు పరిశీలించారు. తమ కూతురును చంపి ఉరివేసి ఆత్మహత్య చేసుకుందని చెబుతున్నారని మృతురాలు తల్లిదండ్రులు చక్రధర్, శివలీల ఆరోపించారు. తండ్రి చక్రధర్ తమ కూతురు చనిపోయిన విషయం కూడా తమకు చెప్పలేదని గ్రామస్తులు 2.30 గంటల సమయంలో తమకు ఫోన్‌లో సమాచారం ఇచ్చిన వెంటనే వచ్చి చూసేసరికి ఇంట్లో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిందన్నారు. కాళ్లు బెడ్‌పై ఆనిఉన్నాయని బోరున విలపించారు. భర్త మోహన్ కుటుంబ సభ్యులపై తమకు అనుమానం ఉందని వాపోయారు. మృతురాలి భర్త మోహన్, తన అన్న నవీన్, వదిన మణిని ఏమి జరిగిందని ఏఎస్పీ ప్రశ్నించారు. తమకు ఎలాంటి మనస్పర్ధలు గానీ గొడవలు లేవన్నారు. తాము వరికోతలు కోసేందుకు ఉదయం ఇంటి నుంచి వెళ్లామని మధ్యాహ్నం భోజనానికి వచ్చిన సమయంలో బెడ్రూమ్ తలుపులు మూసి ఉన్నాయని ఎంత పిలిచినా పలుకకపోవడంతోతులుపులు తెరిచి చూడగా ఉరేసుకుని కనిపించిందన్నారు. వెంటనే ఇరుగు పొరుగు వారికి చెప్పామని విషయాన్ని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు మృతురాలు భర్త మోహన్, బావ నవీన్ ఏఎస్పీకి వివరించారు. మృతురాలు భర్తను విచారించిన పోలీసులు మృతురాలి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

మిల్లులో బోల్టులు ఊడిపడి మహిళ..

- క్లీనింగ్ చేస్తుండగా ఘటన


కవిత మృతదేహం

వరంగల్: గ్రేటర్ పరిధిలోని 3వ డివిజన్ పరిధి కొత్తపేట సమీపంలోని జ్యోతి మిర్చి ఇండస్ట్రీస్‌కు చెందిన కారం పొడి మిల్లులో సోమవారం జరిగిన దుర్ఘటనలో శివనగర్‌కు చెందిన ప్రతాపగిరి కవిత(29) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫ్లోర్ మిల్లులో మిర్చిని పొడిగా మార్చే భారీ పరికరం(డెక్కన్)ను మెకానిక్‌లు క్లీనింగ్ చేస్తున్న క్రమంలో దాని బోల్టులు ఊడిపడడంతో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న కవితపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి కుమారుడు ఉదయకిరణ్, కూతురు సునీత ఉన్నారు. ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ మహేందర్, ఎస్సై రాజన్‌బాబు తెలిపారు. ఆమె ఫిర్యాదులో మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తన భార్య మృతి చెందినట్లు భర్త వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. జ్యోతి మిర్చి ఇండస్ట్రీస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఏనుమాముల సమీపంలో బాలాజీనగర్‌లో ఐదేళ్ల క్రితం పల్లిమిల్లులో జరిగిన సంఘటనలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. ఇండస్ట్రీస్‌లో పురుషులు చేయాల్సిన యంత్రాల వద్ద మహిళలతో చేయించడం, జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లనే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి సందర్శించి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించారు.

వ్యక్తికిగాయాలు

ఖిలా వరంగల్: వరంగల్ లేబర్ కాలనీలో సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెండెల సురేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ప్రమాదానికి కారణమైన డాక్టర్ బానాల అరుణ్‌పై చర్యలు తీసుకోవాలని పెండెల రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


బయ్యారం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మండలంలోని కొత్తపేటలో చోటుచేసుకుంది. కాచనపల్లికి చెందిన ఊకే సందీప్(20) మోటార్‌సైకిల్‌పై కొత్తపేట నుంచి ఇల్లందు–మహబూబాబాద్ రహదారిపై నామాలపాడు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇల్లందు నుంచి మహబూబాబాద్ వైపు వెళ్తున్న మ్యాజిక్ వాహనం ఢీకొనటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై రమాదేవి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీజేఐటీలో విద్యార్థినికి గాయాలు

- హైదరాబాద్ ఆస్పత్రికి తరలింపు

జనగామ: స్థానిక క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఓ విద్యార్థిని గాయాలపాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన విద్యార్థిని సీజేఐటీలో బీటెక్ ఫస్టియర్ చదువుకుంటుంది. తన సోదరుడు కూడా ఇందులోనే ద్వితీయ సంవత్సరంలో ఉన్నాడు. ఇద్దరు కలిసి సుమారు ఉదయం 10 గంటల సమయంలో కళాశాలకు వచ్చారు. చెల్లెను అక్కడే దింపి...పరీక్ష రాసేందుకు సోదరుడు నేరుగా తరగతిగదిలోకి వెళ్లాడు. విద్యార్థిని తరగతి గదికి వెళ్లకుండా కళాశాల వెనుకభాగం వైపు ఎందుకు వెళ్లిందో తెలియడం లేదు. కళాశాల భవనం వెనకవైపు ఓ తరగతి గది పక్కన అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని సిబ్బంది గమనించి ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే తల్లిదండ్రులతో పాటు కళాశాలలో ఉన్న సోదరునికి సమాచారం అందించి, లోకల్‌గా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యపరీక్షల కోసం అక్కడ నుంచి హైదరాబాద్‌కు తరలించారు. కళాశాల యాజమాన్యం సమాచా రం మేరకు సీఐ ఎలబోయిన శ్రీనివాస్ అక్కడికి చేరుకుని విచారణ జరిపారు. విద్యార్థిని పడి ఉన్న స్థలంతో పాటు రోడ్డుపక్కన ఉన్న ప్రహరీ, ఇతర ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం పలువురు విద్యార్థినులు, అధ్యాపకులను సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. కాగా విద్యార్థిని సోదరుడిని పలకరించగా కళ్లు తిరిగి పడిపోవచ్చని చెప్పారు. ఈ విషయమై కళాశాల డైరెక్టర్ అగస్టీన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని కళాశాలకు వచ్చిన తర్వాత తరగతి గదికి వెళ్లలేదన్నారు. సుమారు ఉదయం 10.30 గంటల సమయంలో భవనం వెనకాల విద్యార్థిని పడి ఉందని సిబ్బంది తెలపడంతో అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు. సీఐ మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం సమాచారం మేరకు ఇక్కడికి వచ్చి ప్రాథమిక విచారణ చేసినట్లు స్పష్టం చేశారు. విద్యార్థిని స్పృహలోకి వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. తమకు ఎటువంటి ఫిర్యాదు ఇవ్వలేదన్నారు.

జీపీ వర్కర్ అనుమానాస్పద మృతి


యాకూబ్‌పాషా మృతదేహం

మంగపేట: స్థానిక గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్‌గా 15 ఏళ్లుగా పనిచేస్తున్న మండల కేంద్రంలోని ముస్లింవాడకు చెందిన ఎస్‌కే యాకూబ్‌పాష(36) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. మండల కేంద్రంలోని ఓ షాపు యజమాని బల్బు దొంగిలించాడని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం రాత్రి తీవ్రంగా కొట్టాడు. ఈ సంఘటన షాపు యజమాని షాపు ఎదుట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో రికార్డు అయింది. తెల్లారేసరికి మృతుడు రోడ్డు పక్కన షాపుల ముందు మృతి చెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు సుమారు 100 మంది పోలీస్‌స్టేషన్ ఎదుట, మండల కేంద్రంలోని గంపోణిగూడెం వద్ద ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధానరోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఆదివారం రాత్రి కొబ్బరిబోండాల వ్యాపారి బ్రహ్మాజీ కొట్టడం వల్లనే యాకూబ్‌పాషా మృతి చెందాడన్నారు. వెంటనే అతన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్సై తాహెర్ బాబా అందుబాటులో లేకపోవడంతో ఉపవాస దీక్షలో ఉన్న సుమారు 200 మందికి పైగా ముస్లింలు రాస్తారోకోలో పాల్గొన్నారు. పోలీసులు సీఐ రాజుకు సమాచారం ఇచ్చారు. నేరం రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకుటామని రాస్తారోకో చేస్తున్న వారికి సర్దిచెప్పారు. మృతుని తల్లి మహబూబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని అనుమానితున్ని అదుపులోకి తీసుకున్నారు. దీంతో శాంతించారు.